అంజనగిరి రిజర్వాయర్‌లోకి పరుగులు పెడుతున్న కృష్ణా జలాలు

జలహాసం

- పీఆర్‌ఎల్ఐ మోటర్ ప్రారంభం
- నార్లాపూర్ వద్ద పంపింగ్
- పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ
- అంజనగిరి రిజర్వాయర్‌కు జలకళ
- 1.6 టీఎంసీలు చేరిన జలాలు
- సంతోషంలో రైతన్నలు

ఎంతో ఆనందంగా ఉంది..

అంజనగిరి గ్రామం పచ్చని రెండు కొండలను కలుపుతూ 74మీటర్లతో ఎత్తు కట్టను నిర్మించారు. అంజనగిరి రిజర్వాయర్‌లోకి కృష్ణానది జలాలు తరలిరావడంతో జలసంద్రంగా మారింది. మాకు సాగునీటికి ఆయకట్టు లేకపోయినప్పటికీ శాశ్వత తాగునీటి సమస్య తీరనున్నది. తెలంగాణ సర్కార్ ఎంతో సాహసోపేతంగా నిర్మించిన అంజనగిరి రిజర్వాయర్‌తో మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసాను ఇస్తుంది.

- కిషన్, రైతు, ఎర్రగట్టు, బొల్లారం

కొల్లాపూర్, అక్టోబర్ 7 : పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ సమీపంలోని నార్లాపూర్ వద్ద పీఆర్‌ఎల్ఐలో మొదటి లిఫ్ట్ ఒకటో మోటర్ నుంచి పంపింగ్‌ను అధికారులు శుక్రవారం రాత్రి తిరిగి షురూ చేశారు. సర్జ్‌పూల్‌లో ఉన్న జలాలను పంప్‌హౌస్‌లోని మోటర్ ఎత్తిపోస్తున్నది. కొండలను దాటుకొని.. పైపులను ఎగబాకుతూ కృష్ణమ్మ బిరబిరా తరలివస్తున్నది. డెలివరి సిస్టర్న్ నుంచి నురగలు కక్కుతూ పరవళ్లు తొక్కుతున్నది. దీంతో అంజనగిరి రిజర్వాయర్‌లోకి పరుగులు పెట్టింది. శనివారం సాయంత్రానికి 1.6 టీఎంసీల నీరు చేరినట్లు ఇరిగేషన్ శాఖ డీఈఈ లోకిలాల్ తెలిపారు. గత నెల 16న సీఎం కేసీఆర్ వెట్‌రన్‌ను ప్రారంభించి ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన విషయం తెలిసిందే.. తర్వాత రెండో సారి గత నెల 27వ తేదీన మోటర్ ద్వారా నీటి తోడివేత ప్రక్రియ మొదలుపెట్టి తర్వాత ఈనెల 2వ తేదీ మధ్యాహ్నం నిలిపివేశారు. నాలుగు రోజుల తర్వాత మళ్లీ మోటర్‌ను ఆన్ చేయడంతో నీలవేణి జలసరాగాలను సంతరించుకున్నది. గలగల పారుతూ అంజనగిరి రిజర్వాయర్‌లోకి చేరుతున్నది. నాలుగు రోజుల పాటు నీటి పంపింగ్ కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు. నీటి రాకతో రిజర్వాయర్ జలకళను సంతరించుకున్నది. ఓ పక్క ఎంజీకేఎల్ మొదటి లిఫ్ట్‌లో భాగంగా నిర్మించిన ఎల్లూరు రిజర్వాయర్.. దాన్ని అనుసరించే మరోపక్క అంజనగిరి రిజర్వాయర్ జలదృశ్యాన్ని సాక్షాత్కరిస్తున్నాయి. కృష్ణమ్మను తాకిన నల్లమల కొండలు పులకరించిపోయాయి. రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కష్టాలు పూర్తిగా తీరనున్నాయని మొలచింతపల్లి, ముక్కిడిగుండం, కొత్త అంజనగిరి, ఎర్రగట్టు బొల్లారం, గిరిజన తండాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా వివిధ జిల్లాల నుంచి రైతులు, ప్రజలు ప్రాజెక్టును తిలకించేందుకు తరలివస్తున్నారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణం మహా అద్భుతమని, రూపకల్పన చేసిన సీఎం కేసీఆర్‌కు జయహో అంటున్నారు.

నాలుగు రోజులపాటు పంపింగ్..

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద నిర్మించిన ప్రాజెక్టులో శుక్రవారం రాత్రి ఒక మోటరు ద్వారా పంపింగ్ ప్రారంభమైంది. ఈ మోటరును మరో నాలుగు రోజులపాటు నడుపుతాం. దీంతో అంజనగిరి రిజర్వాయర్‌లోకి ఈ దఫా 2టీఎంసీల సామర్థ్యం మేరకు నీటిని నింపుతాం. నీటితో బండ్ పటిష్టమవుతుంది.

- లోకిలాల్, డీఈ, నీటిపారుదలశాఖ

పాలమూరు ప్రాజెక్టు మొదటి లిఫ్ట్ నీటి డెలివరీ సిస్టర్న్ నుంచి పైకి ఎగిసిపడుతున్న నది జలాలు

ఆడపడుచులకు సర్కారు అండ

- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, అక్టోబర్ 7 : ఆడపిల్లల పెండ్లి అంటేనే బంధువులు సైతం అప్పులు అడుగుతారని ముఖం చాటేసే కాలంలో వారికి మేనమామగా అండగా ఉంటున్నది ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కొత్తకోట పట్టణంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే ఏ రాష్ట్రంలో అమలు కాని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని తెలిపారు. త్వ రలో జరుగబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు దిమ్మదిరిగే విధంగా మ్యానిఫెస్టో ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో వస్తున్నద, రాష్ట్రంలో, దేశంలో ఆ పార్టీకే గ్యారెంటీ లేదన్నారు. ప్రజలు మాయ మాటలు నమ్మితే మరో వందేళ్ల అభివృద్ధి వెనక్కిపోవడం గ్యారెంటీ అన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్ అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. అనంతరం 103 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంతమౌనిక, వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్, ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి ప్రశాంత్, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీను, కొండారెడ్డి, పద్మా అయ్యన్న, సంధ్య రవీందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఖాజా మైనొద్దీన్, మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ఉన్నారు.

20ఏండ్ల కలసాకారం

- రూ.31కోట్లతో జీల్డార్‌తిప్ప లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభం
- రంగాదాస్ జీల్డార్‌తిప్ప ప్రాజెక్టుగా నామకరణం చేసిన ఎమ్మెల్యే బీరం

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, అక్టోబర్ 7 : ఎన్నో దశాబ్దాలుగా సాగునీటి కోసం నిరీక్షిస్తూ వచ్చిన నల్లమల గ్రామాల రైతాంగం కల ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు సాకారమైంది. గత నెల 16వ తేదీన కొల్లాపూర్ సభలో సీఎం కేసీఆర్‌కు దృష్టికి ఎమ్మెల్యే ఈవిషయాన్ని తీసుకెళ్లగా, రూ.31కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు కొల్లాపూర్ మండలం నల్లమల అడవిలోని మొలచింతపల్లి సమీపంలో జీల్డార్‌తిప్ప ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శనివారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ.. గత 20ఏండ్లుగా అసమర్థుడి పాలనలో కష్టాలపాలైన నల్లమల గ్రామాలైన మొలచింతపల్లి, ముక్కిడిగుండం గ్రామాలకు సాగునీరందించే జీల్డార్‌తిప్ప ప్రాజెక్టును పట్టించుకోలేదని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుపై పరోక్షంగా విమర్శించారు. 1975లో నాటి ఎమ్మెల్యే రంగదాస్ చొరవ తీసుకొని నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళ్‌రావుతో జీల్డార్‌తిప్ప ప్రాజెక్టు నిర్మాణం కోసం శంకుస్థాపన చేయించిన విషయాన్ని ఎమ్మెల్యే బీరం గుర్తుచేశారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రంగదాస్ జీల్డార్‌తిప్ప ప్రాజెక్టుగా నామకరణం చేయనున్నట్లు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రకటించడంతో ప్రజల నుంచి స్పందన లభించింది. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ అమర్‌సింగ్, ఎంపీపీ భోజ్యానాయక్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ భాస్కర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రామచందర్‌యాదవ్, ముక్కిడిగుండం సర్పంచ్ దశరథంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కృతజ్ఞతలు..

జీల్డార్‌తిప్ప లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శనివారం శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి, దివంగత మాజీ ఎమ్మెల్యే రంగదాస్ తనయుడు, మాజీ ఎంపీపీ జగన్‌మోహ్మన్‌దాస్ కృతజ్ఞతలు తెలిపారు.

దేశంలోనే తెలంగాణ అగ్రగామి

- అన్నివర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి
- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిలకొండ, అక్టోబర్ 7 : సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్ స్థానంలో నిలిచిందని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొత్లాబాద్, సూరారం, మల్లాపూర్, ఇబ్రహీంనగర్, కోయిలకొండ, ఖాజీపూర్, కేశవపూర్, శేరివెంకటాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామకొండను రూ.11కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం కోసం రూ.75లక్షలతో అధునాతననంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు.

చేపల పెంపకంపై ప్రత్యేక దృష్టి..

కొత్లాబాద్, ఖాజీపూర్ చెరువుల్లో ప్రభుత్వం అందించిన చేపపిల్లలను ఎమ్మెల్యే వదిలారు. శేరి వెంకటపూర్‌లో రూ.2కోట్లతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. క్రీడా సామగ్రిని శ్రీరామకొండ వద్ద యువకులకు అందించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

మండలంలోని ఇబ్రహీంనగర్, బూర్గుపల్లి, ఖాజీపూర్, అంకిళ్ల గ్రామాల నుంచి ఎమ్మెల్యే సమక్షంలో శనివారం బీఆర్‌ఎస్‌లో 400 మంది చేరారు.

ప్రగతిపథం బుక్‌లెట్ ఆవిష్కరణ..

నారాయణపేట నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రగతి పథం బుక్‌లెట్‌ను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఖాజీపూర్‌లో ఆవిష్కరించారు. అంతకుముందు సూరారంలో మహిళలకు బతకమ్మ చీరలు అందించారు.

బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఖాజీపూర్‌లో క్రీడా మైదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

సాగునీటితో రైతుల పాదాలు కడుగుతా..

- అచ్చంపేట ఎత్తిపోతలతో సస్యశ్యామలం చేస్తా..
- మంత్రి కేటీఆర్ పర్యటన తాత్కాలికంగా వాయిదా
- రెండు, మూడ్రోజుల్లో నిర్వహించేలా ఏర్పాట్లు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, గువ్వల బాలరాజు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట, అక్టోబర్ 7 : కృష్ణా జలాలను అచ్చంపేట ప్రాంతంలో పారించి ఈ రైతుల పాదాలు కడుగుతానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, గువ్వల బాలరాజు అన్నారు. అచ్చంపేటలో ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అనారోగ్యం కారణంగా పర్యటన తాత్కాలికంగా వాయిదా పడిందన్నారు. తిరిగి రెండు, మూడ్రోజుల్లో పర్యటన ఉంటుందని చెప్పారు. శనివారం పట్టణంలో మంత్రి సభా స్థలాన్ని, ప్రాజెక్టు పైలాన్, బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్ నిత్యం ప్రజల్లో ఉంటూ.. భారీ సభలు, సమావేశాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపలు ఇలా.. పర్యటిస్తూ ప్రజలకు భరోసానిస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆలోచనా విధానాలు అమలు చేస్తూ వెళ్తున్నారని చెప్పారు. అయితే అనివార్య కారణాలతో మంత్రి కేటీఆర్ స్వల్ప అనారోగ్యానికి గురయ్యారని, దీంతో పర్యటనను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. రెండు, మూడ్రోజుల్లో తిరిగి నిర్వహించే ప్రగతి నివేదిక సభను విజయవంతం చేయాలని కోరారు. రైతులను, ప్రజలను, బీఆర్‌ఎస్ శ్రేణులను భారీగా తరలిరావాలని కోరారు. తిరిగి కేటీఆర్ చేతులమీదుగా అచ్చంపేట ఎత్తిపోతలను ప్రారంభించుకుంటామని తెలిపారు. ఓ పక్క క్యాబినెట్‌లో ఈ లిఫ్ట్ ఆమోదం పొందిన వెంటనే ఇక్కడి ప్రజలు సంబురాలు చేసుకుంటుంటే మరోవైపు ప్రతిపక్షాలు విషం చిమ్మడం మొదలు పెట్టాయని ధ్వజమెత్తారు. ఇప్పుడు మంత్రి కేటీఆర్ పర్యటన వాయిదా పడిందని తెలిసిన వెంటనే మళ్లీ పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టు ఆగిపోతున్నట్లుగా.. వారి వ్యవహారశైలి తయారైందని ధ్వజమెత్తారు. అయితే ఆదివారం సభకు 50–60 వేల మందితో సభ నిర్వహించాలని భావించామని, కానీ మరో రెండ్రోజులు సమయం లభించడంతో అదనంగా మరో 10 వేలకుపైగా జనాన్ని తరలించే అవకాశం లభించిందన్నారు. రైతులు, ప్రజలు, శ్రేణులు, అభిమానులు ప్రభుత్వంపై విశ్వాసంతో ఉన్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంత్రి కేటీఆర్ సభను నిర్వహించి విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు. జనసమీకరణకు వాహనాలు లభించడం లేదని, దేవరకొండ, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, ఇతర ప్రాంతాల నుంచి తెప్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రగతి నివేదిక సభను పండుగలా.. మరుపురాని విధంగా అట్టహాసంగా నిర్వహిస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఎత్తిపోతలను పూర్తి చేసి సాగునీటిని పారించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని స్పష్టం చేశారు. అచ్చంపేటలో ఉమామహేశ్వర ప్రాజెక్ట్ పైలాన్, అనంతరం బహిరంగ సభలో పాల్గొని మంత్రి ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం ఉప్పునుంతలలో 30 పడకల దవాఖాన భవనాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతిపక్ష పార్టీల నాయకులు పర్యటనకు సహకరించాలన్నారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, వైస్ చైర్‌పర్సన్ శైలజా , మాజీ చైర్మన్ తులసీరాం తదితరులున్నారు.

నిరుపేదలకు వరం 'గృహలక్ష్మి'

- ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి
- పాదయాత్రకు నీరాజనం

మమ్మాయిపల్లి పాదయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి, అక్టోబర్ 7 : పేదలకు గృహలక్ష్మి పథకం వరంలాంటిదని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో గృహలక్ష్మి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి నియోజవర్గంలో అన్ని మండలాల లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్స్‌ను ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సీఎం కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇల్లు, గృహలక్ష్మి వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇలాంటి పథకాలు కొనసాగాలన్నా మరింత మందికి అందాలన్నా మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలన్నారు. గృహలక్ష్మి పథకం అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం నిరుపేదలకు వరమన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించి వారికి మొత్తం 108 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసినట్లు చెప్పారు. అనంతరం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కుట్టు మిషన్లను నాగర్‌కర్నూల్ టౌన్ మినహా అన్ని మండలాలకు చెందిన వారికి కుట్టు మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బైకాని శ్రీనివాస్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు బ్రహ్మరథం..

'మర్రి అన్న పదేండ్ల ప్రస్థానం' పాదయాత్రలో భాగంగా శనివారం బిజినేపల్లి మండలంలోని మహదేవునిపేట, శాయిన్‌పల్లి మమ్మాయిపల్లి, అల్లీపూర్, సల్కర్‌పేట, నంది వడ్డేమాన్ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నాయకులు, ప్రజలు ఊరూరా బ్రహ్మరథం పట్టారు. బతుకమ్మలతో మహిళలు ఎదురొచ్చి స్వాగతం పలికారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- రాజాపూర్ మండలం అభివృద్ధి పనుల ప్రారంభం

మల్లెపల్లి సోమ్లాతండా బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రాజాపూర్, అక్టోబర్ 7 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రాజాపూర్ మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. చెన్నవెల్లిలో సీసీ రోడ్లు, మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్, పాఠశాల అదనపు గదులు, క్రీడామైదానం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేసి వాలీబాల్ క్రీడాపోటీలను ప్రారంభించారు. రాయపల్లిలో సీసీ రోడ్లు, పల్లెప్రకృతివనం ప్రారంభించి, అంగన్‌వాడీ కేంద్రం, బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్, మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ముదిరెడ్డిపల్లిలో సీసీ రోడ్లు, మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన పాఠశాల అదనపు గదులు ప్రారంభించారు. బీసీ కమ్యూనిటీ హాల్, ముదిరెడ్డిపల్లి–నందిగామ బీటీ రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. మల్లెపల్లిలో సీసీ రోడ్లు, ఎస్సీ కమ్యూనిటీ హాల్, స్మశానవాటికను ప్రారంభించారు. లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లను అందించారు. ఈద్గాన్‌పల్లిలో రూ.20లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం, రూ.20లక్షలతో నిర్మించిన రైతువేదికను ప్రారంభించారు. అలాగే దొండ్లపల్లి ఎంపీటీసీ అభిమన్యురెడ్డి సొంత నిధులతో నిర్మించిన పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిందన్నారు. అంతేకాకుండా అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. స్వార్థరాజకీయాలకు కాంగ్రెస్, బీజేపీ పార్టీ నాయకులు కులమతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ వాల్యా నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ సుశీల, జెడ్పీటీసీ మోహన్‌నాయక్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు నర్సింహులు, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు బచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, యూత్‌వింగ్ మండలాధ్యక్షుడు వెంకటేశ్, ఎంపీటీసీ అభిమాన్యురెడ్డి, సర్పంచులు రాధ వెంకట్‌రాంరెడ్డి, గంగాధర్‌గౌడ్, పెంటయ్య, శ్యామ్‌బాయి, అలివేలు, ఎంపీడీవో లక్ష్మీదేవి, ఎంపీవో వెంకట్రాములు, ఏవో నరేందర్ పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, అక్టోబర్ 7 : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో రూ.15లక్షలతో నూతనంగా నిర్మించే ఆరెకటిక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరెకటికల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.50లక్షలు ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తైతే పేద ప్రజల వివాహాలు చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

శివాలయ నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ..

జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో ఎమ్మెల్యే శివాలయ నిర్మాణంతోపాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డు ప్రజలు కలిసి కట్టుగా ఉండి ఆలయ నిర్మాణంతోపాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్ పనులు నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ధరూర్ మండల కేంద్రానికి చెందిన జానకమ్మ అనారోగ్యానికి గురికాగా, ఆమెకు మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైనా రూ.1.50వేల ఎల్‌వోసీని అందజేశారు. అలాగే గట్టు మండలం మిట్టదొడ్డి, కుచ్చినెర్లకు చెందిన 8మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఎల్‌ఎల్‌ఆర్ డ్రైవింగ్ లైసెన్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, వైస్ చైర్మన్ బాబర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామన్‌గౌడ్, కౌన్సిలర్లు నరహరిగౌడ్, శ్రీనివాసులు, మురళి, శ్రీను, అనిత, గోవిందు, ఆరెకటిక సంఘం నాయకులు అభిలాష్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

SVS హాస్పిటల్ మహబూబ్‌నగర్
రొమ్ము క్యాన్సర్ అవగాహన మరియు ఉచిత వైద్య శిబిరం!!
అక్టోబర్ 9th నుండి 14th అక్టోబర్ వరకు
Breast Cancer Awareness, Diagnosis & Treatment
ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా SVS హాస్పిటల్‌లో అనుభవజ్ఞులైన క్యాన్సర్ స్పెషలిస్ట్‌లచే, రొమ్ము క్యాన్సర్ పై సలహాలు, సూచనలతో పాటు తక్కువ ఖర్చుతో పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేయబడును.
✤ అల్ట్రా సౌండ్ బ్రెస్ట్ స్కాన్ - Rs. 200/-
✤ మామోగ్రఫీ - Rs. 500/-
✤ సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ (Pap Smear) - Rs. 100/-
✤ FNAC - Rs. 300/-
✤ బయాప్సీ - Rs. 400/-
✤ శస్త్ర చికిత్సలలో 50% రాయితీ ఇవ్వబడును
వివరాలకు ఈ మొబైల్ 7893888529 / 6303444232 నెంబర్ల పై సంప్రదించగలరు.
Dept of Medical & Surgical Oncology
SVS Medical College Hospital